

క్రిస్మస్ సందడి
పల్లెలు పట్టణాల్లో క్రిస్మస్ సందడి ప్రారంభమైంది. పండగ సమీపించడంతో చర్చిలను విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.
- 8లో..



వైఎస్సార్ సీపీ నాయకుడిపై దాడి
పెద్దారవీడు పంచాయతీ సిద్ధినాయునిపల్లిలో వైఎస్సార్ సీపీ నాయకుడిపై టీడీపీ కార్యకర్త సోమవారం దాడి చేశాడు.
- 8లో..

గరిష్టం/కనిష్టం
23/29

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

జాతీయస్థాయి పోటీలకు దొనకొండ విద్యార్థిని



ప్రైసీతో హెచ్‌ఎం, పీఈటీ

దొనకొండ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఎనుబరా ప్రైసీ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 21, 22 తేదీల్లో కర్నూలు డీఎస్ఏ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ నెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపడంతో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపికై నట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు నరసింహారావు తెలిపారు. ఈ నెల 28 నుంచి చెన్నైలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు వీవీ రామాంజనేయులు ఆధ్వర్యంలో ఎనుబరా ప్రైసీకి అభినందన సభ ఏర్పాటు చేశారు.

27 లోగా అభ్యంతరాలు తెలియజేయాలి

ఒంగోలు వన్‌టౌన్: స్కూల్ క్లస్టర్ల సముదాయాలపై ఈ నెల 27వ తేదీ లోగా అభ్యంతరాలు తెలియజేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఏ కిరణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జిల్లాలో ఏర్పాటు చేస్తున్న స్కూలు క్లస్టర్ సముదాయాల వివరాల జాబితాను ఉప విద్యాశాఖాధికారి కార్యాలయాల వద్ద, మండల విద్యాశాఖ అధికారుల కార్యాలయాల వద్ద ఉంచినట్లు పేర్కొన్నారు. అభ్యంతరాలను విద్యాశాఖ వెబ్‌సైట్ ద్వారా కుడా తెలపవచ్చన్నారు.

31 వరకు పరీక్ష ఫీజు చెల్లించొచ్చు

ఒంగోలు వన్‌టౌన్: పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్ష ఫీజులను ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 31వ తేదీ వరకూ చెల్లించవచ్చని ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ కె.శివకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో ఒక్కో సబ్జెక్టుకు రూ.100, ఇంటర్మీడియెట్‌లో ఒక్కో సబ్జెక్టుకు రూ.150 చొప్పున చెల్లించాలన్నారు. ఓపెన్ స్కూల్స్ కో ఆర్డినేటర్లు తమ వద్ద అడ్మిషన్లు పొందిన పదో తరగతి విద్యార్థుల ఫీజును చెల్లించాలన్నారు. అపరాధ రుసుం రూ.25లతో జనవరి 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు, రూ.50 అపరాధ రుసుంతో 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

సిబ్బంది బయోమెట్రిక్‌ను పర్యవేక్షించాలి



వీడియో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు వేయాలని, ఆ ప్రక్రియను సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. ప్రకాశంభవనం నుంచి మున్సిపల్ కమిషనర్లు, మండల స్థాయి అధికారులతో పలు అంశాలపై సోమవారం వీడియో సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాఠశాల మరుగుదొడ్లు, అదృశ్యం కేసులు, మ్యాపింగ్, గృహనిర్మాణాలు తదితర అంశాలపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సచివాలయాల్లో విధుల పట్ల ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం వహించే వారిపై, దీర్ఘకాలిక సెలవులు పెట్టిన వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరుతో జీతాలకు అనుసంధానం చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నెలాఖరు నాటికి జియో ట్యాగింగ్ పూర్తి చేసి అందరి బ్యాంకు ఖాతాలను ఎన్‌పీఐతో మ్యాపింగ్ చేయాలన్నారు. హౌస్‌హోల్డ్ క్లస్టర్లను ఆయా హ్యాబిటేషన్లు, పంచాయతీలు, రెవెన్యూ గ్రామాలతో మ్యాపింగ్ చేయాలని సూచించారు. సచివాలయం వారీగా సున్నా నుంచి ఆరేళ్ల వయసున్న పిల్లల ఆధార్ అప్డేషన్ ప్రక్రియ నూరుశాతం పూర్తి చేయాలన్నారు. జనన ధ్రువీకరణ లేని పిల్లలకు సర్టిఫికెట్లు ఇప్పించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 3800 ఇళ్ల నిర్మాణాలు లక్ష్యం ఉండగా ఇప్పటికే 2101 ఇళ్లు పూర్తి చేశారని, మిగిలినవి త్వరగా పూర్తి చేయాలన్నారు. తాగునీటి డిమాండ్‌ను గుర్తించి ఆ మేరకు పక్కాగా ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు సంబంధించి పక్కాగా సర్వే చేపట్టాలన్నారు. నాట్ వర్కింగ్ యూనిట్లు వివరాలను నమోదు చేయాలన్నారు. జిల్లాలో 73 సచివాలయాల్లో ఇప్పటి వరకు ఈ సర్వే చేపట్టలేదని, వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ చిరంజీవి, సీపీఓ వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాల శంకరరావు, హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్, పరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాసరావు, ఐసీడీఎస్, మెప్మా పీడీలు హేనసుజన, రవికుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్పెషల్ మత్తు

జిల్లాలో మద్యం ఏరులై పారుతోంది. ఎక్కడ చూసినా బెల్టు షాపులే.. ఊళ్లన్నీ మత్తులో జోగుతున్నాయి. అధికార కూటమి నేతల అండదండలతో ఈ వ్యాపారం మూడు క్వార్టర్లు.. ఆరు ఫుల్ బాటిల్లా విరాజిల్లుతోంది. లైసెన్స్ దుకాణాల నుంచి బెల్టు షాపులకు తీసుకొచ్చిన మద్యం బాటిళ్లపై ఉన్న లేబుళ్లను తొలగించి విక్రయాలు చేస్తారు. అయితే ప్రీమియం బ్రాండ్‌ల విషయంలో కోడ్ పెట్టుకుని సరఫరా చేస్తున్నారు. ఎస్పీ అన్న కోడ్ ఉంటే దానిని ఎవరూ పట్టుకోరని బెల్టుషాపు నిర్వహణదారులే చెబుతున్నారు. ఎస్పీ అంటే బ్రాండ్ కాదు.. స్పెషల్ పర్మిషన్ అని పుష్పా స్టైల్లో గర్వంగా చెబుతున్నారు. దీన్ని బట్టి చూస్తే జిల్లాలో బెల్టు దుకాణాల దందా ఏ స్థాయిలో సాగుతుందో అవగతమవుతోంది.



సీసాపై 'ఎస్పి' పర్మిషన్ ముద్ర

బెల్ట్‌లో 'ఎస్పీ' బ్రాండ్
- ప్రీమియం బ్రాండ్‌లకు ప్రత్యేక కోడ్
- ఎస్పీ అంటే బ్రాండ్ కాదు .. స్పెషల్ పర్మిషన్
- గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ దుకాణాలు
- జిల్లాలో 1500 నుంచి 2000 వరకు బెల్ట్ షాపులు
- విక్రేతలందరూ అధికార పార్టీ వారే
- బెల్టు షాపుల పై దాడుల్లోనూ అధికారుల వివక్ష

కోడ్ ఎస్పీ..ఎవరూ పట్టుకోరు..
జిల్లాలో బెల్టుషాపుల్లో ప్రీమియం బ్రాండ్‌ల విక్రయాల విషయంలో ప్రత్యేక కోడ్‌లు ఏర్పాటు చేసుకున్నట్టు తెలుస్తోంది. లైసెన్స్ మద్యం దుకాణాల నుంచి బెల్ట్ షాపులకు విక్రయించే మద్యం సీసాలకు ఉన్న లేబుల్‌ను తొలగించి సరఫరా చేస్తారు. ఎందుకంటే ఒకవేళ ఎవరైనా, ఎక్కడైనా అక్రమ మద్యం సీసాలు పట్టుకున్నా ఏ షాపుదో తెలియకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త తీసుకుంటున్నారు. అయితే ప్రీమియం బ్రాండ్‌లపై మాత్రం ఎస్‌పి అనే ముద్ర వేసి విక్రయిస్తున్నారు. కొనకనమిట్ల ప్రాంతంలో రాయల్‌స్టాగ్ మీద ఎస్‌పి అనే సొంత ముద్ర వేసుకొని విక్రయించడం కనిపించింది. ఎస్‌సి అనేది ఏంటి అని ఎవరైనా అడిగితే దానికి వారు పొంతనలేని సమాధానాలు చెబుతున్నారు. ఎస్‌పి అంటే స్పెషల్ పర్మిషన్ అని, ఈ ముద్ర ఉంటే ఎవరూ పట్టుకోరని బెల్టు దుకాణం నిర్వహణదారులు చెబుతున్నట్టు తెలుస్తోంది.

పొదిలి రూరల్:

జిల్లాలో ప్రభుత్వం 171 మద్యం దుకాణాలకు లైసెన్స్‌లు మంజూరు చేస్తే అనధికారికంగా 1500 నుంచి 2000 వరకూ బెల్టు షాపులు నడుస్తున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మద్యం విక్రయాలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుండటంతో అధికార పార్టీ నేతల అండదండలతో మాఫియా రెచ్చిపోతోంది. లైసెన్స్ మద్యం షాపుల నుంచి ప్రతి రోజు బొలేరో, ఆటో, ద్విచక్ర వాహనాల ద్వారా మద్యం సీసాలను బెల్ట్ షాపులకు సరఫరా అవుతున్నాయి. అధికార పార్టీ కనుసన్నల్లో జరుగుతున్న దీన్ని అధికారులు సైతం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. సంతనూతలపాడు నియోజకవర్గంలో మొత్తం 21 మద్యం దుకాణాలు ఉండగా, 260కి పైగా బెల్ట్ షాపులు, దర్శి నియోజకవర్గంలో లైసెన్సు దుకాణాలు 24 ఉండగా, బెల్ట్ దుకాణాలు మాత్రం 550 వరకు, కొండపి నియోజకవర్గంలో లైసెన్సు దుకాణాలు 20 ఉండగా, బెల్ట్ షాపులు మాత్రం 215 ఉన్నాయి. కనిగిరి నియోజకవర్గంలో 21 లైసెన్సు దుకాణాలు ఉండగా, 200కుపైగా బెల్ట్ షాపుల్లో మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఇక మార్కాపురం నియోజకవర్గంలో 150, గిద్దలూరు నియోజకవర్గంలో 160కి పైగా బెల్ట్ దుకాణాలు నడుస్తున్నాయి. యర్రగొండపాలెం నియోజకవర్గంలో కూడా ఇదే తరహా తంతు కొనసాగుతోంది.

మాటలకే పరిమితం..
బెల్టుషాపులు నిర్వహిస్తూ పట్టుబడితే రూ.5 లక్షల వరకు జరిమానా విధిస్తామని సీఎం చంద్రబాబు గొప్పలు చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో బెల్టుషాపుల అమ్మకాలే అధిక మొత్తంలో ఉన్నాయి. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడ బెల్టుషాపులు వెలుస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామాల్లో పెద్ద ఎత్తున బెల్టుషాపులు ఏర్పాటు కావడంతో తమ కాపురాలు నాశనమవుతున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల మధ్యే మద్యం లభిస్తుండటంతో కూలి డబ్బులన్నీ మద్యానికే ఖర్చు చేస్తున్నారని పేద మహిళలు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు.

క్వార్టర్‌పై రూ.50 నుంచి రూ.100కి పైగా అదనం
ప్రస్తుతం చాలా ప్రభుత్వం లైసెన్స్ మద్యం షాపుల్లో ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీకే విక్రయిస్తున్నారు. రాత్రి పది దాటితే మాత్రం ధరలు వారి ఇష్టం. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో సమయపాలన పాటించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక బెల్ట్ దుకాణాలు తెల్లవారుజామున 4 గంటల నుంచి అర్ధరాత్రి వరకు ఎక్కడ కావాలంటే అక్కడ విక్రయాలు చేస్తున్నారు. సమయాన్ని బట్టి ఒక్కో సీసాపై రూ.50 నుంచి రూ.100 వరకు అదనంగా తీసుకుంటున్నారు.

బెల్టుషాపులపై దాడిలోనూ వివక్ష
బెల్టుషాపులపై అడపా దడపా దాడి చేసే విషయంలోనూ అధికారులు వివక్ష చూపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అధికార పార్టీ నేతలు నిర్వహించే బెల్టుషాపుల వద్దకు దాడికి వచ్చే సమయంలో ముందుగా సమాచారం ఇస్తున్నారు. అదే ఇతర వ్యక్తులకు చెందిన వారి షాపుపై ఆకస్మిక దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

మామూళ్ల మత్తులో అధికారులు..
ప్రభుత్వ నిబంధనలు ప్రకారం బెల్ట్‌షాపులు పెట్టినా, అక్రమంగా మద్యం విక్రయించినా, ప్రభుత్వం అనుమతి లేకుండా ఎక్కడైనా కూర్చుని మద్యం తాగినా చట్ట పరమైన చర్యలు తీసుకోవాలి. కానీ ఇక్కడ అధికారులు అవేమీ పట్టించుకోవడం లేదు. మామూళ్ల మత్తులో కార్యాలయాలు దాటి బయటకు రావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మద్యం దుకాణాల వద్ద సిట్టింగ్ పర్మిషన్ లేదు. కానీ పొదిలి సర్కిల్ పరిధిలోని అన్ని లైసెన్సు షాపుల వద్ద సిట్టింగ్ రూంలు ఏర్పాటు చేసి ప్రత్యేక బంకులు నిర్వహిస్తున్నారు. ఈ బంకులకు ఏ సమయంలో వెళ్లినా మద్యం దొరుకుతోంది.

అర్జీలు చిత్తశుద్ధితో పరిష్కరించాలి



గ్రీవెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: గ్రీవెన్స్‌కు వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులు చిత్తశుద్ధితో నిర్దీత గడువు లోగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి పక్కాగా పరిష్కరించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. గ్రీవెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణతో కలిసి సోమవారం మీకోసం గ్రీవెన్స్ నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రత్యేక శ్రద్ధ వహించి సమస్య తిరిగి పునరావృతం కాకుండా చూడాలన్నారు. క్షేత్ర స్థాయిలో సిబ్బందితో సమన్వయం చేసుకుని అర్జీదారులకు అర్థవంతమైన సమాధానాలు ఇవ్వాలన్నారు. ప్రతి వారం గ్రీవెన్స్ సమస్యలపై సమీక్షిస్తామన్నారు. అర్జీలు రీ ఓపెన్ అయితే వాటి కారణాలను వివరించాలన్నారు. కలెక్టర్ గ్రీవెన్స్‌లో 255 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, లోకేశ్వరరావు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

■ భాగ్యనగర్ సర్వే నంబర్ 7లో నాల్గవ తరగతి ఉద్యోగులకు కేటాయించిన స్థలాన్ని కొంత మంది దొంగ పట్టాలతో వ్యాపారాలు చేస్తున్నారని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోమటిగుంట వెంకటేశ్వర్లు గ్రీవెన్స్‌లో అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. సర్వే నెంబర్ 7లో 9.70 ఎకరాల భూమిని మార్కెట్ రేటుకు సంఘానికి కేటాయించారని, దానిలో నాల్గవ తరగతి ఉద్యోగులు 144 మందికి ప్లాట్లుగా విభజించి కేటాయించినట్లు తెలిపారు. మిగిలిన 1.10 ఎకరాల భూమిని కమ్యూనల్ పర్పస్ కోసం రిజర్వు చేసినట్లు వివరించాడు. అయితే కొంతమంది ఆ భూమిలో అక్రమ లేఅవుట్ సృష్టించి దొంగ పట్టాలతో వ్యాపారాలు చేస్తున్నారని, పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.



గణిత మేధావికి రంగుల నివాళి
గణిత మేధావి శ్రీనివాస రామానుజన్‌కు రంగవల్లులతో ప్రత్యేకంగా నివాళులర్పించారు. జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని మార్కాపురం మండలం గజ్జలకొండ పాఠశాలలో విద్యార్థులు 20 అడుగుల శ్రీనివాస రామానుజన్ చిత్రాన్ని రంగువల్లులతో తీర్చిదిద్దారు. ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంది.
- మార్కాపురం రూరల్

బడి వదిలి..పని బాటకు..

ఆరు నెలల బాబు పాలనలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ తిరోగమనంలో పయనిస్తుంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలను పునర్జీవం పోసి కార్పొరేట్‌ను తలదన్నేలా తీర్చిదిద్దారు. అమ్మఒడి పథకంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య భారీగా పెరిగింది. కానీ కూటమి ప్రభుత్వ తీరులో ఆరు నెలల్లో వేలాది మంది విద్యార్థులు చదువుకు దూరమయ్యారు. ఓ పక్క అమ్మకు వందనం అందక, మరో పక్క ఉపాధి లేక పిల్లలను చదివించుకోలేక తల్లిదండ్రులు పిల్లలను పనులకు తీసుకెళుతున్నారు. దీంతో ఈ ఆరు నెలల కాలంలో 30,813 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి డ్రాపౌట్స్‌గా తేలారు.



పిల్లలకు మనం ఏదైనా ఆస్తి ఇస్తున్నాం అంటే అది కేవలం ఒక్క విద్య మాత్రమే. అందుకే ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేసి మంచి విద్య అందించడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యం.
■ 2019-2024 మధ్య కాలంలో నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మాటలివి

ప్రభుత్వ విద్య అనేది కేవలం ప్రభుత్వాలే బాధ్యత తీసుకోలేవు.. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు కూడా విద్యను అందించడానికి ముందుకు రావాలి..
■ 2014-2019 మధ్యలో ప్రభుత్వాన్ని పాలించిన సీఎం చంద్రబాబునాయుడు వాదన ఇది.

- ప్రభుత్వ పాఠశాలల్లో క్రమంగా తగ్గుతున్న విద్యార్థులు
- ఆరు నెలల్లో 30,813 మంది విద్యార్థులు డ్రాపౌట్
- చంద్రబాబు నిర్వాకంతో ప్రభుత్వ పాఠశాలలకు గ్రహణం
- చదువు మాన్పించి పనులకు పంపుతున్న తల్లిదండ్రులు
- డ్రాపౌట్స్‌పై కొరవడిన పర్యవేక్షణ

ఒంగోలు సిటీ: ప్రభుత్వ విద్యా వ్యవస్థకు 2019–2024 మధ్య కాలం స్వర్ణయుగం. అరకొర వసతులతో కునారిల్లుతున్న ప్రభుత్వ విద్యా వ్యవస్థను గాడిలో పెట్టి కార్పొరేట్‌ను తలదన్నేలా పాఠశాలను తీర్చిదిద్దారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరిగి..నో అడ్మిషన్ బోర్డులు పెట్టిన సందర్భాలూ ఉన్నాయి. డ్రాపౌట్స్ క్రమంగా తగ్గిపోయారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్కసారిగా పరిస్థితి మారిపోయింది. ప్రతి నెలా వేల సంఖ్యలో విద్యార్థులు పాఠశాలలను వీడుతున్నారు.

ఆరు నెలల్లో 30 వేల మంది..
కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు జిల్లాలోని 38 మండలాల్లో సుమారు 3.15 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. కానీ డిసెంబర్ 20 నాటి ఆ సంఖ్య 2,83,190కి పడిపోయింది. దీంతో ఆరు నెలల్లోనే సుమారు 30 వేల మందికి పైగా విద్యార్థులు డ్రాపౌట్ అయ్యారు. ప్రతి నెలా ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపౌట్స్ సంఖ్య పెరిగిపోతోంది. ఒక్కో మండలం నుంచి వందలాది మంది విద్యార్థులు పాఠశాలలను వీడుతున్నారు.

ఒక్క పైసా కూడా ఇవ్వలేదే..
గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో తల్లుల ఖాతాల్లో ఠంచన్‌గా అమ్మఒడి నగదు జమయ్యేది. దీంతో తల్లిదండ్రులకు ఆర్థిక కష్టాలు తప్పి పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపారు. అమ్మఒడే కాదు..ప్రతి విద్యార్థికి కొత్త యూనిఫాం, షూ, సాక్స్‌లు, టై, బెల్టు అందజేశారు. జగనన్న గోరుముద్దను మధ్యాహ్న భోజనంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేశారు. కానీ కూటమి ప్రభుత్వంలో అంతా తలకిందులైంది. ఎన్నికల సమయంలో అమ్మకు వందనం పేరుతో ప్రతి విద్యార్థికి రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చి..అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటి వరకు పైసా కూడా ఇవ్వలేదు. దీంతో తల్లిదండ్రులకు ఆర్థిక కష్టాలు వెంటాడి..పిల్లలను పాఠశాలలకు మాన్పించి తమతో పాటు పనులకు తీసుకువెళుతున్నారు.

డ్రాపౌట్స్‌పై ప్రత్యేక క్యాంపులేవి..?
గతంలో సచివాలయ ఉద్యోగులతో పాటు విద్యాశాఖాధికారులు గ్రామాల్లో పర్యటించి డ్రాపౌట్స్‌పై నిఘా ఉంచేవారు. బడిఈడు పిల్లలు బయట కనిపిస్తే వెంటనే వారిని పాఠశాలల్లో చేర్పించి తల్లిదండ్రులతో మాట్లాడేవారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో ఈ కార్యక్రమాన్ని పూర్తిగా అటకెక్కించేసింది.

ఫీజులు కట్టలేక మరికొందరు..
గత ప్రభుత్వంలో అమ్మఒడి అందడంతో కొంత మంది ప్రైవేట్ పాఠశాలల్లో చేరారు. ఈ కానీ సంవత్సరం ప్రారంభం నుంచి ఒక్క పైసా కూడా రాకపోవడంతో వారు పాఠశాలలకు దూరమయ్యారు. ఇదే అదునుగా ప్రైవేట్ పాఠశాలలు భారీగా ఫీజులు పెంచి దోచుకుంటున్నారు. గత ఐదేళ్లలో అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థకు పునర్జీవం పోస్తే..ప్రస్తుతం చంద్రబాబు విద్యా వ్యవస్థను నాశనం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

తల్లికి వందనం ఏది



ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం పేరుతో రూ.20 వేల చొప్పున ఇస్తామని చెప్పారు. కానీ ఆరు నెలలుగా ఒక్క రూపాయి ఇవ్వలేదు. గత ప్రభుత్వంలో ఏటా ఠంచన్‌గా అమ్మఒడి అందింది. చంద్రబాబు ఇచ్చిన హామీని అమలు చేయాలి.
– వి.సరోజ

బాబు ష్యూరిటీ..బాదుడు గ్యారంటీ



కరెంట్ చార్జీల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, నేతలు

- ప్రజలను మోసం చేయడంలో ట్రేడ్‌మార్క్ చంద్రబాబు
- విద్యుత్ వినియోగదారులకు షాకులే షాకులు
- పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించే వరకు పోరాటం
- విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ: టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే విద్యుత్ బిల్లులు పట్టుకుంటే షాక్ తగిలేలా సుమారు రూ.15 వేల భారం ప్రజలపై మోపిందని, పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించే వరకు పోరాటం చేస్తామని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. డాక్టర్ సురేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలపై విద్యుత్ చార్జీల రూపంలో పిడుగులు కురిపిస్తుందని ఆరోపించారు. నవంబర్‌లో రూ.6వేల కోట్లు, డిసెంబర్‌లో రూ.9 వేల పైచిలుకు కోట్లు విద్యుత్ చార్జీల రూపంలో ప్రజలపై అదనపు భారం మోపిందని ఆరోపించారు. చంద్రబాబు ఎన్నికల ముందు..అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలు తగ్గిస్తానని, ఎండలో, గాలిలో కరెంట్ తయారు చేసి వినియోగదారుల నుంచి మిగులు కరెంట్ కొనుగోలు చేస్తానని చెప్పారని, కానీ అధికారంలోకి రాగానే యూజర్ చార్జీల పేరుతో ప్రజలు కోలుకోలేకుండా భారం మోపారని మండిపడ్డారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మోసం మరోసారి నిరూపితమైందన్నారు. బాబు ష్యూరిటీ..బాదుడు గ్యారంటీ లాగా చంద్రబాబు పాలన ఉందని ఎద్దేవా చేశారు. ప్రజలను రకరకాల మాయమాటలతో కొత్త కొత్త అబద్ధాలతో మోసం చేయడం బాబు ట్రేడ్ మార్క్ రాజకీయమని ఎద్దేవా చేశారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనలోనూ విద్యుత్ రంగాన్ని నిట్టనిలువునా ముంచేస్తూ డిస్కంలను పూర్తిగా నష్టాల్లోకి నెట్టేసి దాదాపు 24 శాతం వార్షిక అప్పుతో డిస్కంలు కుదలయ్యేలా చేశాడని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత రూ.47 వేల కోట్లను డిస్కంలకు అందించి చేయూత ఇచ్చారని కొనియాడారు. గతంలో అవసరం లేకపోయినా అధిక ధరలకు ఎడాపెడా విద్యుత్ కొనుగోలు చేసిన ఘనత చంద్రబాబుకు దక్కుతుందన్నారు. చంద్రబాబు ఏం చేసినా ఆహో ఓహో అంటూ పచ్చపత్రికలు బాకాలు ఊదుతున్నాయని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. అందులో భాగంగా నియోజకవర్గ కేంద్రాల్లో ఈ నెల 27న నిరసన తెలిపి విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేస్తామని, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం కరెంటు చార్జీల బాదుడుపై వైఎస్సార్ సీపీ పోరుబాట గోడపత్రికను ఆవిష్కరించారు. పార్టీ వైద్య విభాగం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ సుల్తాన్, మండల అధ్యక్షుడు సామంతుల రవికుమార్‌రెడ్డి, మసనం వెంకట్రావు, పొన్నలూరు ఎంపీపీ కె.మాధవరావు, జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, జేసీఎస్ కన్వీనర్ పిల్లి తిరుపతిరెడ్డి, పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, షేక్ పటేల్, షేక్ కరీం, రావూరి ప్రభావతి, చొప్పర శివ, చుక్కా కిరణ్‌కుమార్, సునీల్, షేక్ అబ్దుల్లా, పాలూరి శ్రీనివాసులరెడ్డి, తన్నీరు రామకృష్ణ, షేక్ అహమ్మద్, తన్నీరు వినోద్, తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం మెడికల్ కళాశాలను ప్రభుత్వమే నిర్మించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మెడికల్ కళాశాల పరిరక్షణ నాయకులు

ఒంగోలు టౌన్: మార్కాపురంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మెడికల్ కళాశాలను కూటమి ప్రభుత్వమే పూర్తి చేయాలని మార్కాపురం మెడికల్ కళాశాల పరిరక్షణ కమిటీ సోమవారం కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కమిటీ కన్వీనర్ అందె నాసరయ్య మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మార్కాపురంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెడికల్ కళాశాల నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిలిపివేయడం దారుణమన్నారు. ప్రైవేట్ భాగస్వామ్యంలో మెడికల్ కళాశాల నిర్మించి నిర్వహించాలని కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విద్యా సంవత్సరమే కళాశాలను ప్రారంభించాలని గత ప్రభుత్వం నిర్ణయించి వైద్య అధ్యాపకులను, డాక్టర్లను నియమించిందన్నారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రొఫెసర్లు, అధ్యాపక డాక్టర్లను, సిబ్బందిని వెనక్కి పంపించిందని తెలిపారు.

క్లుప్తంగా

గుప్తనిధుల పేరుతో రూ.6 లక్షలకు టోకరా

మార్కాపురం: తన పొలంలో గుప్తనిధులు ఉన్నాయని, వాటిని తవ్వి తీసేందుకు డబ్బులు లేవని, నువ్విస్తే వాటిని తవ్వితీద్దామని, నిధులు బయటపడితే నువిచ్చిన అమౌంట్‌కు డబుల్ ఇస్తానని చెప్పి ఓ వ్యక్తి తన వద్ద 6 లక్షల రూపాయలు వసూలు చేసి ఇప్పుడు తప్పించుకుని తిరుగుతున్నాడని మార్కాపురం పట్టణం విద్యానగర్‌లో నివాసముండే లాయర్ గుమాస్తా ముటుకుల సుబ్రహ్మణ్యం సోమవారం రాత్రి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పెద్దారవీడు మండలం కలనూతల గ్రామానికి చెందిన గోదా నడిపయ్య తరుచూ కోర్టు కేసులపై మార్కాపురం వచ్చి లాయర్ గుమాస్తా సుబ్రహ్మణ్యంతో మాట్లాడేవాడు. ఆ పరిచయంతో నడిపయ్య తన పొలంలో గుప్తనిధులు ఉన్నాయని, వాటిని తవ్వేందుకు ఖర్చవుతుందని, అంత అమౌంట్ తన వద్ద లేదని చెప్పాడు. ఆ అమౌంట్ నువ్విస్తే నీకు డబుల్ ఇస్తానని చెప్పడంతో ఈ ఏడాది మార్చి నుంచి సెప్టెంబరు వరకూ 6 లక్షల రూపాయలను చెల్లించానని, అయితే ఈ విషయమై తాను విచారణ చేయగా అబద్ధమని తేలిందని, సదరు వ్యక్తి ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడని, తనకు న్యాయం చేయాలని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. పట్టణ ఎస్సై సైదుబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోవా మద్యం స్వాధీనం


మద్యం సీసాలు చూపుతున్న ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి

కంభం: గోవా మద్యం తీసుకెళ్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని వారి నుంచి 54 ఫుల్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. కొమరోలుకు చెందిన డి.తిరుమల కేశవ, తిరులయ్య అనే ఇద్దరు కంభంలో ఓ వ్యక్తి నుంచి మద్యం కొనుగోలు చేసి తీసుకెళ్తుండగా అందిన సమచారం మేరకు బేస్తవారిపేట మండలం మోక్షగుండం వద్ద వారిని ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకొని మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ తీసుకొచ్చి ఇక్కడ విక్రయాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించామని, వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని సీఐ కొండారెడ్డి తెలిపారు.

ఎస్బీ హెడ్ కానిస్టేబుల్ మునీర్ మృతి

ఒంగోలు టౌన్: స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ షేక్ మునీర్ (54) గుండెపోటుతో మృతి చెందారు. సోమవారం సాయంత్రం గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆయన్ను హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. 1993వ బ్యాచ్‌కు చెందిన మునీర్ కుటుంబంతో కలిసి నగరంలోని ప్రకాశం కాలనీలో నివసిస్తున్నారు. ఆయన మరణించిన సమాచారం తెలిసిన వెంటనే నగరంలో ఉన్న స్పెషల్ బ్రాంచి సిబ్బంది ఆయన ఇంటి వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. నిబద్ధత కలిగిన హెడ్ కానిస్టేబుల్ మునీర్ మరణించడం బాధాకరమని ఎస్పీ ఏఆర్ దామోదర్ విచారం వ్యక్తం చేశారు.

భార్య కాపురానికి రాలేదని యువకుడి ఆత్మహత్యాయత్నం

- కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు


ఒంగోలు టౌన్: భార్య కాపురానికి రాలేదని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం.. చీమకుర్తికి చెందిన అశోక్ తరుచూ గొడవ పడుతుండటంతో భార్య అలిగి పుట్టింటికి వెళ్లింది. వారికి ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. కాపురానికి రమ్మంటూ బతిమాలినా ఆమె రాలేదు. దీంతో మనస్తాపం చెందిన అశోక్ సోమవారం సాయంత్రం ఒంగోలు చేరుకున్నాడు. కొప్పోలు ఫ్లయి ఓవర్ బ్రిడ్జికి సమీపంలో రైలు ట్రాక్‌పై పడుకొని ఆత్మహత్య చేసుకోబోతున్నానంటూ కుటంబ సభ్యులకు వీడియో కాల్ చేసి చెప్పాడు. వెంటనే అప్రమత్తమైన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. తక్షణమే స్పందించిన టూటౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు తన సిబ్బందిని పంపించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఆ వ్యక్తిని పట్టుకున్నారు. ఆత్మహత్య చేసుకోకుండా కాపాడి టూటౌన్ పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం అతడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

సింగరాయకొండలో దొంగ హల్‌చల్

- పలు దుకాణాల్లో చోరీ

సింగరాయకొండ: పట్టణంలో ఓ దొంగ పలు దుకాణాల్లో చోరీకి పాల్పడ్డాడు. ఈ సంఘటన సోమవారం తెల్లవారు జామున మండల కేంద్రంలోని కందుకూరు రోడ్డు సెంటర్, పోస్టాఫీసు సెంటర్లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కందుకూరు రోడ్డు సెంటర్‌లోని శివరాజ్ రైస్‌మిల్, పోస్టాఫీసు సెంటర్‌లోని పాత ఇనుప కొట్టు, హరికృష్ణ వైన్స్ తాళాలు పగలకొట్టి దొంగ చోరీకి పాల్పడ్డాడు. చోరీలో సుమారు 5 వేల రూపాయలు నగదుతో పాటు మద్యం బాటిల్స్ మాయమయ్యాయి. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తిస్తామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేంద్ర తెలిపారు.


విద్యుత్ వెలుగుల్లో మార్కాపురం తెలుగు బాప్టిస్టు నగర్ చర్చి


ఒంగోలు క్లౌపేటలో విద్యుత్ దీప అలంకరణలో గృహాలు


ఒంగోలు నీలంపాలెంలో క్రిస్మస్ స్టార్



కంభంలోని ఓ పాఠశాలలో ఏర్పాటు చేసిన పశువుల పాక

క్రిస్మస్ సందడి

సాక్షి నెట్‌వర్క్: పల్లెలు పట్టణాల్లో క్రిస్మస్ సందడి ప్రారంభమైంది. పండగ సమీపించడంతో పట్టణాలు, పల్లెల్లో చర్చిలు ముస్తాబయ్యాయి. చర్చిలను విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. క్రిస్టియన్ల ఇళ్లన్నీ పండగ వాతావరణంలో కళకళలాడుతున్నాయి. తన పుట్టుక ఉద్దేశాన్ని ఏసు వివిధ సందర్భాల్లో ఇలా అభివర్ణించారు.

- మారు మనసు పొందుటకై పాపులను పిలువ వచ్చితిని– లూకా సువార్త 5:32
- ఇదిగో ప్రజలందరికినీ కలగబోవు మహా సంతోషకరమైన సువర్తమానమును నేను మీకు తెలియజేస్తున్నాను. దావీదు పట్టణంలో నేడు రక్షకుడు మీ కొరకు పుట్టి ఉన్నాడు. ఆయనే ప్రభువైన క్రీస్తు – లూకా 2:10,11
- ఆయన కుల మత వర్గ జాతీ బేధాలు లేకుండా అందరి పాపులను క్షమించేందుకు వచ్చాడని అనుటకు ఇదే ఆనవాలు
- మానవుల మధ్య ఉన్న అంతరాలను తీసివేసేందుకు అందరి వాడిగా పుట్టిన దినమే క్రిస్మస్
- క్రిస్మస్.. అంటే రెండు పదాల కలయిక.. దీని అర్థం క్రీస్తు ఆరాధన


విద్యుత్ కాంతులతో కంభం సీఎస్ఐ చర్చి


ఒంగోలు కబాడీపాలెంలో క్రిస్మస్ స్టార్స్


విద్యుత్ వెలుగుల్లో మార్కాపురం లూథరన్ చర్చి


ఒంగోలులో ఓ ఇంటి వద్ద క్రిస్మస్ స్టార్

రోడ్డు ప్రమాదంలో ఆర్‌సీఎం చర్చి ఫాదర్ మృతి

- క్రిస్మస్ వస్తువుల కొనుగోలుకు వెళ్తూ రోడ్డు ప్రమాదం
- దీనికి ముందు సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఫాదర్
- ఆర్‌సీఎం చర్చి పరిధిలో విషాద ఛాయలు


సంఘటన స్థలంలో గాయాలతో ఉన్న ఫాదర్


ప్రమాదానికి ముందు ఓ స్కూల్లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఫాదర్ మరియదాసు


మరియదాసు (ఫైల్)

కంభం: క్రిస్మస్ వేడుకలకు అంతా సిద్ధం చేసుకుంటున్న సమయంలో రోడ్డు ప్రమాదంలో చర్చి ఫాదర్ మృతి చెందడంతో విషాదం నెలకొంది. వివరాలు.. కంభం ఆర్‌సీఎం చర్చి ఫాదర్‌గా పని చేస్తున్న వి.మరియదాసు (48) చర్చిలో క్రిస్మస్ వేడుకలకు అవసరమైన వస్తువులు కొనుగోలు చేసుకునేందుకు తన ద్విచక్ర వాహనంపై సోమవారం పట్టణంలోకి వెళ్తున్నారు. అర్ధవీడులో దినం కార్యక్రమం చూసుకొని ఓ కుటుంబం కారులో గుంటూరు వెళ్తోంది. కందులాపురం కూడలి సమీపంలో అనంతపురం–అమరావతి హైవేపై బైకును కారు ఢీకొట్టింది. వేగంగా వస్తున్న కారు ముందుగా కందులాపురం కూడలిలో ఓ స్కూటీని ఢీకొట్టబోయి తప్పించుకొని ఫాదర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఫాదర్ కారు కింద పడగా కొద్దిదూరం వరకు లాక్కెళ్లి ఆగింది. దీంతో ఫాదర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనం వెనక కూర్చొని ఉన్న సంతోష్ అనే యువకుడి కాలికి తీవ్ర గాయాలయ్యాయి. అతనికి కంభం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స అందిస్తున్నారు. తీవ్రగాయాలైన ఫాదర్‌ను తొలుత కంభం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా పరిస్థితి విషమంగా ఉండటంతో మార్కాపురం తరలించి అక్కడి నుంచి నరసరావుపేట తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో పరిస్థితి మరింత విషమంగా మారింది. వినుకొండ దగ్గర్లో ఓ వైద్యశాలకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఫాదర్

ఆర్‌సీఎం చర్చిలో ఆదివారం రాత్రి నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఫాదర్ మరియదాసు పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు. సోమవారం ఉదయం కూడా పట్టణంలోని ఓ ప్రైవేటు స్కూల్లో జరిగిన ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని చిన్నారులతో సరదాగా గడిపి వారిని ఆశీర్వదించి వచ్చారు. క్రిస్మస్ పండగ రెండు రోజులే ఉండటంతో చర్చిలో పండగకు అవసరమైన వస్తువులు తెచ్చుకునేందుకు వెళ్తూ ఇలా హఠాత్తుగా రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందడంతో ఆర్‌సీఎం చర్చి పరిధిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఫాదర్ మృతదేహం వద్దకు స్థానికులు తరలి వచ్చి నివాళులర్పించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్సై నరసింహారావు ప్రమాదానికి కారణమైన కారును పోలీసుస్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడిపై టీడీపీ కార్యకర్త దాడి


చికిత్స పొందుతున్న వెంకటరెడ్డి

పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడు పంచాయతీ సిద్ధినాయునిపల్లిలో వైఎస్సార్ సీపీ నాయకుడిపై టీడీపీ కార్యకర్త సోమవారం దాడి చేశాడు. గ్రామంలోని రామాలయం ఎదుట బజారులో సిమెంట్ రోడ్డు వేస్తున్నారు. అదే బజారులో వెంకటరెడ్డి అనే వైఎస్సార్ సీపీ నాయకుడు తన ఇంటి ముందు నిల్చొని మూతామేస్త్రీ శ్రీనుతో మాట్లాడుతూ సిమెంట్ రోడ్డు సక్రమంగా వేయాలని, తమ ఇంటిపైకి వర్షం నీరు వచ్చేలా వాటం ఎక్కువ పెట్టకుండా సమానంగా ఇరుపక్కలకు నీరు వెళ్లేలా రోడ్డు వేయాలని సూచించారు. వెంకటరెడ్డి మూతామేస్త్రీ శ్రీనుతో మాట్లాడుతున్న సమయంలో సిమెంట్ రోడ్డుకు సంబంధం లేని టీడీపీ కార్యకర్త పొందుగుల వెంకటేశ్వరరెడ్డి వచ్చాడు. తమ ప్రభుత్వంలో తమ ఇష్టం వచ్చినట్లు రోడ్డు వేస్తామని, నీవు ఏవరు అడిగేందుకని అనవసరంగా గొడవ పెట్టుకున్నారని వెంకటరెడ్డి చెప్పారు. టీడీపీ కార్యకర్త పొందుగుల వెంకటేశ్వరరెడ్డి దుర్భాషలాడి అక్కడే ఉన్న ఇనుప రాడ్ తీసుకుని భుజంపై కొట్టడంతో గాయమైందని వెంకటరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే బాధితుడిని కుటుంబ సభ్యులు మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. సిమెంట్ రోడ్డు వేయించే టీడీపీ కంట్రాక్టర్ అక్కడ లేరు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్నారని బాధితుడు తెలిపాడు.

క్షుద్రపూజల కలకలం

- సిద్ధినాయునిపల్లె వాసుల ఆందోళన
- మూఢనమ్మకాలపై పోలీసుల అవగాహన


క్షుద్రపూజల కోసం రామాలయం వద్ద వేసిన ముగ్గు

యర్రగొండపాలెం: పెద్దారవీడు మండలం సిద్ధినాయునిపల్లెలో క్షుద్రపూజల కలకలం రేకెత్తించి. ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గ్రామంలోని ఎస్సీ పాలెం రామాలయం వద్ద ముగ్గులు వేసి పూజలు చేసిన ఆనవాళ్లు గుర్తించిన ఆ పాలెం వాసులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ముగ్గులు వేసి క్షుద్రపూజలు చేసిన వారెవరని, ఎందుకు ఈ పనికి ఒడిగట్టారని స్థానికులు చర్చించుకుంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పాలేనికి నడిబొడ్డున ఉన్న రామాలయం వద్ద ఈ చర్యకు పాల్పడటంపై అకతాయిల పనై ఉంటుందని మరికొందరు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడిన వారిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

మూఢ నమ్మకాలపై అవగాహన

పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడు పంచాయతీ సిద్ధినాయునిపల్లి ఎస్సీ కాలనీలో మూఢనమ్మకాలపై ఏఎస్‌ఐ సుబ్బయ్య సోమవారం సాయంత్రం ప్రజలకు అవగాహన కల్పించారు. రామాలయం వద్ద ముగ్గుతో బొమ్మ వేసి పసుపు, కుంకుమ చల్లి నిమ్మకాయలు కోసి ముక్కలు పడేసిన స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ క్షుద్రపూజలకు ఏవరు భయపడాల్సిన అవసరం లేదని, భయభ్రాంతులకు గురికావద్దని, ధైర్యంగా ఉండాలని చెప్పారు. కొత్త వ్యక్తులు ఎవరైనా కాలనీలో సంచరిస్తున్నట్లు తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. రాత్రి పూట పోలీసులు గస్తీ తిరుగుతారని చెప్పారు.


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌ఐ సుబ్బయ్య

మానవాళి కోసం రక్తం చిందించిన జీసస్


కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, మంత్రి స్వామి, మేయర్

ఒంగోలు వన్‌టౌన్: ఏసుక్రీస్తు మానవాళి కోసం రక్తం చిందించారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఒంగోలు కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ క్రీస్తు బోధనలు ఆచరణీయమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఎక్కువ మంది జరుపుకుంటున్న పండగ క్రిస్మస్..అని అన్నారు. కలెక్టర్ తమీమ్ అన్సారీయా మాట్లాడుతూ ఎవరైతో పేద ప్రజల పట్ల దయగా ఉంటారో వారికి క్రీస్తు ఆశీస్సులు ఉంటాయన్నారు. జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ మాట్లాడుతూ ఒకరి పట్ల ఒకరికి గౌరవ భావం, ప్రేమ కలిగి ఉండాలని ఏసుక్రీస్తు బోధించారన్నారు. నగర మేయర్ గంగాడ సుజాత, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి పార్థసారథి, పాస్టర్‌లు, వివిధ క్రైస్తవ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.